క్లుప్తంగా

'కన్యక' చిత్రం షూటింగ్ పూర్తి



నకరికల్లు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శ్రీ కాశీవిశ్వనాథ్ పిక్చర్స్ వారి కన్యక చిత్రం ఆఖరి షెడ్యూల్‌ను సోమవారం చిత్రీకరించారు. దర్శకుడు తిరువాయిపాటి రాఘవ మాట్లాడుతూ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి మహిమలపై ప్రత్యేకంగా రచించిన పాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందన్నారు. డివోషనల్, హారర్, థ్రిల్లర్ అంశాలతో ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే విధంగా సినిమా ఉంటుందని తెలిపారు. చిత్రంలో మమత, శిరీష, జయ, రేవతి, శివరామరాజు, జబర్దస్త్ వాసు, ఈశ్వర్, ప్రసాదరావు నటించారన్నారు. కొరియోగ్రాఫర్ శ్యామ్ పాటకి నృత్యం సమకూర్చారు. నిర్మాతలుగా స్థానికులైన కె.అమరలింగేశ్వరరావు, ఎ.సాంబశివరావు, కె.పూర్ణచంద్రరరావు వ్యవహరించారు. డిస్ట్రిబ్యూటర్ డీకే బోయపాటి మాట్లాడుతూ 30 ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌పై సినిమా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా మల్లాది వేంకటేశ్వరుని కల్యాణం

అమరావతి: భక్తుల పాలిట కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం మల్లాది గ్రామంలోని వటవృక్షాంతర్గత వెంకటేశ్వరుని 47వ వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి వినుకొండ శ్రీనివాసాచార్యులు స్వామి వారికి అభిషేకాలు చేపట్టారు. పంచ సూక్తాలతో పంచామృత స్నపనను శాస్త్రీయంగా చేశారు. భక్తులు తెచ్చిన తులసీ దళాలతో విశేష అలంకరణ గావించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రానుసారం పరుచూరి శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో.. శనగవరపు రామ్మోహనశర్మ ప్రత్యక్ష వ్యాఖ్యానంతో సుమారు 50 మంది దంపతులతో కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. సాయంత్రం పెద శేష వాహనంపై ఉభయదేవేరులతో వెంకటేశ్వరుని గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి, మర్రిచెట్టు వద్ద వెంకటేశ్వరునికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు యేలూరి శ్రీనివాసరావు భక్తులకు ఉచిత ప్రసాదాలు అందజేశారు.

ప్రతీ ఇంటికి ఆరోగ్యశ్రీ కార్డు అందజేయాలి



రాజుపాలెం: ప్రతి ఇంటికి వెళ్లి ఏఎన్‌ఎంలు, గ్రామ వలంటీర్లు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు పంపిణీ చేయాలని రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. పలు గృహాలకు వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ కార్డుపై అవగాహన కల్పించారా అని ఆరా తీశారు. ఈ విధంగా ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఈ నెలాఖరులోగా మండలంలోని అన్ని గ్రామాల్లో కార్డుల పంపిణీ జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, జిల్లా డిప్యూటీ మెడికల్ అండ్ హెల్త్ అధికారి హనుమకుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు పి.జీవన్‌రావు, జోత్స్న, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు



ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం విధుల్లో చేరారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు, గర్భిణులకు సేవలు కొనసాగించారు. మొత్తం 9 కేంద్రాల్లో నలుగురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరుగురు అంగన్‌వాడీ హెల్పర్‌లు విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ ముప్పాళ్ళ, ఇరుకుపాలెం సెక్టార్ల సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, జయలక్ష్మి తెలిపారు. చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ-3, ఇరుకుపాలెం, తొండపి-3 కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ముప్పాళ్ళ-1,2,3, కొంకావారిపాలెం, దమ్మాలపాడు-4, రుద్రవరం-2 గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని హెల్పర్‌లు విధుల్లో చేరారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేర వారిని విధుల్లోకి తీసుకున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. తుది ఓటర్ల జాబితాను అందించారు. మొత్తం 44 పోలింగ్ కేంద్రాల వద్ద తుది ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఆర్ఐలు అంజనేయులు, పవన్‌కుమార్, కపిల్‌దేవ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమం

- నవరత్నాల వెలుగుల్లో పల్లెలు
- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- 80 వేల మందికి రూ.2,100 కోట్ల లబ్ధి
- అభివృద్ధికి పెద్దన్నలా పెదకూరపాడు



అచ్చంపేట: నవరత్నాలు సంక్షేమ పథకాల వెలుగుల్లో పెదకూరపాడు నియోజకవర్గం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ప్రతి ఇంటికి లబ్ధికి చేకూరి చిరునవ్వులు విరబూస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 80 వేలకు పైగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు వివిధ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి బటన్ నొక్కి నేరుగా రూ.2,095 కోట్లు జమచేశారు. ఎలాంటి వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా.. 29 రకాల సంక్షేమ పథకాల అమలులో స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.



గతేడాది వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు(ఫైల్)

విద్యకు అగ్ర తాంబూలం

- అమ్మఒడి ద్వారా నియోజకవర్గంలో 62,032 మంది విద్యార్థులకు రూ.178 కోట్లలను నేరుగా వారి తల్లుల ఖాతాలకు జమచేశారు.
- జగనన్న విద్యాదీవెన ద్వారా 15,262 మంది విద్యార్థులకు రూ.89 కోట్లు చెల్లించారు. జగనన్న వసతి దీవెన ద్వారా హాస్టల్ విద్యార్థులు 13,363 మందికి రూ.15 కోట్లు చెల్లించారు.
- మధ్యాహ్న భోజనంలో 'జగనన్న గోరుముద్ద' పరిపుష్టి కల్పించింది. 18,664 మంది విద్యార్థులకు రూ.19కోట్లతో పౌష్టికాహారం అందించారు.
- జగనన్న విద్యా కానుకగా 15,860మంది విద్యార్థులకు రూ.11కోట్లతో విద్యా కిట్లు పంపిణీ చేశారు.
- సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు 2,529 మంది 8వ తరగతి విద్యార్థులకు రూ.4 కోట్లు విలువైన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. హైస్కూలు స్థాయిలో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధనను ఉపాధ్యాయులు అందిస్తున్నారు.

గుండెల్లో 'గూడు' కట్టుకున్న సీఎం..

- పేదల అభ్యున్నతే లక్ష్యంగా.. 9,261మందికి సెంటున్నర స్థలాన్ని వైఎస్సార్ జగనన్న కాలనీల ద్వారా ప్రభుత్వం అందించింది. నివాసయోగ్యంగా..తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ సౌకరాల కోసం రూ.134 కోట్లు వెచ్చించారు.

రైతన్నకు భరోసా...

రైతు భరోసా ద్వారా 43,703మంది రైతన్నలకు రూ.205కోట్లు అందజేశారు.

- ఇన్‌పుట్ క్రాప్ ఇన్స్యూరెన్స్ కింద 18,671మంది రైతులకు రూ.20కోట్లు చెల్లించారు.
- 10,198 మంది రైతన్నలకు రూ. 28కోట్లు వడ్డీలేని రుణాలు అందజేశారు. ఊరూర రైతు భరోసా కేంద్రాలతో విత్తు నుంచి పంట కోత వరకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.



మాదిపాడు జగనన్న కాలనీలో పూర్తయిన ఇల్లు



ట్యాబ్‌లతో 8వ తరగతి విద్యార్థులు(ఫైల్)

అక్కచెల్లెమ్మలకు అండగా..

- డ్వాక్రా గ్రూపు అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా పథకం 37,167మందికి రూ.92 కోట్లు చెల్లించారు. వడ్డీలేని రుణాలు 44,933మంది మహిళలకు రూ.9కోట్లు ఇచ్చారు.
- 45 నుంచి 60 సంవత్సరాలలోపు 16,762 మంది అక్కచెల్లెమ్మలందరికీ వైఎస్సార్ చేయుత ద్వారా రూ.75వేలు చొప్పున రూ.74కోట్లు పంపిణీ చేశారు.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు 4,494మందికి రూ.85లక్షలు చెల్లిస్తున్నారు.

అవ్వాతాతలకు పెద్ద కొడుకులా..

సమాజిక పింఛన్ల నగదు పెంపు విషయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయలేదు. 44,836మందికి ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున రూ.336 కోట్లు ప్రతి నెలా ఒకటో తేదీన తలుపుకొట్టి వలంటీర్లు అందజేస్తున్నారు.

చిరువ్యాపారులకు చేదోడు..

తోపుడుబండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే వారికి, టైలర్స్‌కు, బార్బర్ షాపులు, వృత్తి పనులు చేసుకుంటున్న 2,909మందికి జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.15కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమచేశారు.

- అర్చకులు, పాస్టర్స్, ఇనామ్స్ కూడా జగనన్న ప్రభుత్వం అండగా ఉంది. 168మంది అర్చకులకు రూ.84లక్షలు, 183 పాస్టర్స్‌కు రూ.91లక్షలు, 13మంది ఇనామ్‌కు రూ.65వేలు ప్రతి నెలా చెల్లిస్తున్నారు.

'ఆరోగ్య శ్రీ' ఆయువు..

ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఆయువునిస్తోంది. శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి నెలకు రూ.5వేలు చొప్పున 9,351మందికి రూ.4కోట్లకు పైగా చెల్లిస్తున్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న 1,308 మంది వైద్య ఖర్చులకు రూ. 44 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.

అంతేనా..

- కాపు నేస్తం ద్వారా 2,623మంది అక్కచెల్లెమ్మలకు రూ.9కోట్ల ఏటా ప్రభుత్వం చెల్లిస్తోంది. వాహనమిత్ర ద్వారా డ్రైవర్ సోదరులు 1,340 మందికి రూ.3కోట్లు చెల్లిస్తున్నారు. కోవిడ్ కష్టకాలంలో సేవలు అందించిన వారికి, మత్స్యకారులకు, వైఎస్సార్ కాల్యాణ మస్తు, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ జలసిరి, వంటి పథకాల ద్వారా అన్ని వర్గాలవారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమానికి నియోజకవర్గంలో రూ.50లక్షలకు పైగా వెచ్చించారు.

స్థలం ఇచ్చి, ఇల్లు కూడా కట్టించారు



నాకు జగనన్న కాలనీలో సెంటున్నర స్థలం ఇచ్చారు. కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.85లు మంజూరు చేశారు. మరో రూ.2 లక్షలు వేసుకుని ఇంటిని సుందరంగా కట్టుకున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. కుటుంబ సమేతంగా ఇంట్లోనే ఉంటున్నాం. జగనన్న దయవల్లే నాకు సొంతిల్లు అమరింది.

– బాసిపోగు సుజాత, మాదిపాడు

రూ.65వేలు డ్వాక్రా రుణ మాఫీ అయ్యింది



మా గ్రూపులోని పది మంది కలసి రూ.5.30లక్షలు రుణం 2018లో తీసుకున్నాం. నా వాటాగా రూ.57వేలు చెల్లించాల్సి వచ్చింది. నాలుగేళ్లుగా 4 విడతల్లో సంవత్సరానికి రూ.13వేలు చొప్పున ప్రభుత్వమే రుణ ఖాతాకు జమ చేస్తోంది. ఈ ఏడాది కూడా రెండు మూడు రోజుల్లో డబ్బులు వస్తాయన్నారు. అవికూడా వస్తే మొత్తం రుణం మాఫీ అవుతుంది.

– షేక్ పాతిమా, డ్వాక్రా మహిళ, వేల్పూరు

అర్హులందరికి సంక్షేమ పథకాలు



అర్హతే ప్రామాణికంగా గత నాలుగేళ్లుగా నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. గతంలో ఏ ప్రభుత్వం ఇందులో పది శాతం కూడా ఇవ్వలేదు. అర్హత ఉండి పథకాలు రావడం లేదనే వారు ఉండకూడదన్నదే ప్రభుత్వ తాపత్రయం. ఎవరికైనా అర్హత ఉండి, సంక్షేమ పథకాలు రాకపోతే వెంటనే సచివాలయంలో సంప్రదించాలి.

– నంబూరు శంకరరావు, ఎమ్మెల్యే, పెదకూరపాడు.

నేడు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీ

నకరికల్లు: వైఎస్సార్ ఆసరా నాలుగో విడత ద్వారా మండలంలోని 1,041 గ్రూపులకు రూ.8,41,35,047లు లబ్ధిదారుల ఖాతాల్లో మంగళవారం జమ చేయనున్నట్లు ఏపీఎం సునీత తెలిపారు.. గత విడతల్లో రూ.33,65,40,188లను ప్రభుత్వం జమచేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభ కార్యక్రమాన్ని ఆర్బీకేల్లోని టీవీల ద్వారా మహిళలు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

నకరికల్లులో ఓటర్లు 53,435 మంది

నకరికల్లు: ఓటరు తుది జాబితాను పోలింగ్ కేంద్రాల్లో ప్రచురిస్తున్నట్లు తహసీల్దారు కె.నగేష్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం బీఎల్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. మండల తుది ఓటర్ల జాబితాలో పురుషులు 26,598లు, మహిళలు 26,835 మంది, ఇతరులు ఇద్దరు.. మొత్తం 53,435 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. దేశరక్షణ సర్వీసుల్లో 1,528 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. నూతన జాబితాను వెంటనే సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించాలని బీఎల్వోలను ఆదేశించారు. సందేహాలుంటే మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

రాజుపాలెం: పెదనెమలిపురి జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 63 మంది విద్యార్థులకు సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మ, విద్యా కమిటీ చైర్మన్ తాటికొండ అంకమ్మరాజు అందజేశారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రోత్సాహక బహుమతులు

సత్తెనపల్లి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్ ఆర్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ప్రోత్సాహక బహుమతులనూ అందించాలని మంత్రి అంబటి నిర్ణయించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 12,916 మంది మహిళకు ప్రోత్సాహ బహుమతులు అందిస్తున్నారు. సోమవారం సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ళ భాగ్యనగర్ కాలనీలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుక జైపాల్ బహుమతులను ఇంటింటికీ పంపిణీ చేశారు.

సత్తెనపల్లి ఓటర్లు 2,39,077 మంది

అన్ని మండలాల్లో మహిళలే అధికం

సత్తెనపల్లి: నియోజకవర్గంలో పట్టణం, నాలుగు మండలాల పరిధిలో తుది ఓటర్ల జాబితాను పకడ్బందీగా సిద్ధం చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,39,077 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఇందులో పురుషులు 1,17,108 మంది, మహిళలు 1,21,955 మంది, థర్డ్ జెండర్ 14 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 280 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లుగా మార్క్ చేయబడిన వారు 3,158 మంది, 80 సంవత్సరాల పైబడిన వారు 3,478 మంది, 18–19 సంవత్సరాల మధ్య కొత్త ఓటర్లు 4,462 మంది మంది ఉన్నారు. గతేడాది అక్టోబర్ 27న విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,34,442 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం మొత్తం ప్రక్రియ పూర్తికాగా ఓటర్ల సంఖ్య 2,39,077 కు చేరింది. ముసాయిదా జాబితాకు తుది ఓటర్ల జాబితాకు 4,635 ఓట్లు పెరిగాయి. నియోజకవర్గంలోని సత్తనపల్లి రూరల్ మండలంలో అత్యధికంగా 60,901 మంది ఓటర్లు ఉండగా ముప్పాళ్ళ మండలంలో అత్యల్పంగా 35,424 మంది ఓటర్లు ఉన్నారు.



ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి

అంతటా మహిళా ఓటర్లే అధికం...

తుది ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలోని ఒక పట్టణం, నాలుగు మండలాల్లో పురుష ఓటర్లు 1,17,108 మంది ఉండగా మహిళా ఓటర్లు 1,21,955 మంది ఉన్నారు. దీంతో పురుషుల కంటే మహిళలు 4,847 మంది అత్యధికంగా ఉన్నారు.

నియోజకవర్గంలో 2024 జనవరి 22 తుది ఓటర్ల జాబితా ఇలా...

మండలం	పీఎస్‌లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్	మొత్తం ఓటర్లు
సత్తెనపల్లి టౌన్	45	22,852	24,455	06	47,313
సత్తెనపల్లిరూరల్	75	29,774	31,126	01	60,901
ముప్పాళ్ళ	44	17,333	18,090	01	35,424
రాజుపాలెం	47	20,551	21,449	04	42,004
నకరికల్లు	63	26,598	26,835	02	53,435
మొత్తం	274	1,17,108	1,21,955	14	2,39,077

రామ రామ రఘురామ

- నీ నామ స్మరణతో పులకించె పట్టణ, పల్లె సీమ
- అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ వేడుకల వీక్షణ
- భక్తిశ్రద్ధలతో కనుల పండువగా శోభా యాత్ర
- ఊరూరా పండగ వాతావరణం



అమరావతి పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

సత్తెనపల్లి: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ పల్లెల్లు, పట్టణాల్లో పండగ సంబరాలు తెచ్చింది. రామ నామస్మరణతో సోమవారం ఆలయాలు మారుమ్రోగాయి. శోభా యాత్రలు, అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికీ పంపిణీతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అన్ని రామాలయాల్లో వేడుకలు నిర్వహించారు. సామూహిక శ్రీరామ నామ జపం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పట్టణంలో నారాయణ సేన నగర సంకీర్తన ఆధ్వర్యంలో మర్యాద పురుషోత్తముడు శ్రీరాముని చిత్రపటంతో కట్టమూరి వారి వీధిలోని రామాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అలాగే వాల్మీకి నగర్ లోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీరాముని ఆశీస్సులు పొందారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య చలివేంద్ర స్వామి అధ్యక్షుడు శింగరి మధుసూదన్ రావు, ఆర్య వైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. విశ్రాంత తెలుగు పండితుడు మంచికంటి వెంకటేశ్వరరావు శ్రీరామ చరితం ఉపన్యాసమిచ్చారు. భరతనాట్య ప్రదర్శన, భజన, కోలాట ప్రదర్శనలను నారాయణ సేవ నగర సంకీర్తన బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్తెనపల్లి వేద కళాశాల విద్యార్థినులు 'జై శ్రీ రామ్' మానవ అక్షర రూపంలో తమ సంఘీభావం తెలిపారు. కళాశాల ప్రిన్సిల్ ఇ.సరిత, అధ్యపకురాలు అరుణకుమారి పాల్గొన్నారు.

- **అమరావతి:** బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా శ్రీరాముని చిత్రం ఉన్న కాషాయ రంగు జెండాలను పట్టుకుని జైరామ్ అంటూ నినదించారు. ప్రసిద్ధ శైవ పుణ్య క్షేత్రమైన అమరావతి ప్రధాన వీధిలో వైభవంగా శ్రీరామ శోభాయాత్రలో నిర్వహించారు. అమరావతి ఆర్యవైశ్య యూత్ ఆధ్వర్యంలో జై శ్రీరామ్ నినాదాలతో అమరేశ్వరాలయ రాజగోపురం నుంచి శోభా యాత్ర కోదండ రామాలయం వరకు సాగింది. సీతా సమేత శ్రీకోదండరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్తి ఫ్యాక్టరీ బజారులో గొరింట్ల బాబు ఆధ్వర్యంలో 2వేల మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు.



సత్తెనపల్లి పట్టణం కట్టమూరివారి వీధి రామాలయంలో ప్రత్యక్ష ప్రసారం వీక్షణ

- **అచ్చంపేట:** అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా మండలంలోని రామాలయాలు జై శ్రీరామ్ నామంతో మారు మ్రోగాయి. ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు అన్నవరపు సీతారామస్వామి జై శ్రీరామ్ శోభాయాత్ర నిర్వహించారు. సీతాసమేత శ్రీరాములవారి చిత్రపటాలను ఊరేగించారు. కోలాటం ప్రదర్శనలు నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. మాదిపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు రామాలయంలో గ్రామోత్సవం నిర్వహించారు.

క్రోసూరు: మండలంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో శీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాజుపాలెం: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. జయంతీ కాలనీలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీవైష్ణవుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, భజన కార్యక్రమాలు చేశారు.



అచ్చంపేటలో శోభాయాత్ర



ముప్పాళ్ళలోని రామాలయంలో భక్తి గీతాలాపన

ముప్పాళ్ళ: చాగంటివారిపాలెంలోని సీతారామస్వామి ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ముప్పాళ్ళలోని శ్రీకోదండరామస్వామి అభిషేకాలు నిర్వహించారు. రామనామ సంకీర్తన ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

నకరికల్లు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. పురవీధుల్లో జై శ్రీరామ్ అంటూ భారీగా నినాదాలు చేశారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'వైఎస్సార్ ఆసరా' అందజేత

పెదకూరపాడు: డ్వాక్రా మహిళలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పెదకూరపాడు నియోజకవర్గంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నగదు పంపిణీ కార్యక్రమం ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నంబూర శంకరరావు సోమవారం తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. 24న అచ్చంపేట జిల్లా పరిషత్ హైస్కూల్, 25న క్రోసూరు జెడ్పీ హైస్కూల్, 26న బెల్లంకొండ జెడ్పీ హైస్కూలు, 27న అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్, 28న పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్‌లో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాటపై నిలబడే ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అక్కచెల్లెమ్మలు గుర్తించాలని కోరారు.



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అత్యున్నత సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 2వ విడత పంపిణీలో భాగంగా ట్యాబ్‌లు సోమవారం గ్రామసర్పంచ్ వి.బ్రహ్మనాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని, ఆంగ్ల బోధన ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి గ్రామంలోని ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని తెలిపారు. పేద విద్యార్థులు అధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విన్సెంట్ ఫిలోమెన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అత్యధిక సాంకేతికను అందిపుచ్చుకునేందుకు పాఠశాల స్థాయి నుంచి విద్యాభివృద్ధి సాధన దిశలో ప్రభుత్వ ట్యాబ్‌ల పంపిణీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులకు బైజూస్ సాంకేతికత ద్వారా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేవిధంగా ఈ ట్యాబ్‌లు ఉపయోగకరమన్నారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రేమిడిచర్ల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

గ్రామాల్లో వేగంగా కుల గణన

బెల్లంకొండ: గ్రామాల్లో కుల గణన సర్వే వేగంగా చేపడుతున్నట్లు ఎంపీడీఓ బి.వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం సర్వేను ఆయన పరిశీలించారు. కుల గణన సెక్షన్‌లో ఉన్న 14 అంశాలను వలంటీర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి సమగ్రంగా తెలుసుకుని నమోదు చేస్తున్నారన్నారు. కుల గణన సర్వేపై గ్రామాలలో కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని స్పష్టం చేశారు. కుల గణనలో ఎలాంటి తప్పులు లేకుండా సిబ్బంది జాగ్రత్తగా చేయాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు.

కుల గణనలో పొరపాట్లకు తావివ్వొద్దు

సత్తెనపల్లి: కుల గణనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి స్పష్టం చేశారు. పట్టణంలో జరుగుతున్న కుల గణన సర్వే ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. కులాల వారీగా సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని అర్హులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు కులగణన దోహదపడుతుందన్నారు. యాప్‌లో నమోదు చేసే సమాచారం పూర్తి భద్రత, గోప్యత తో ఉంటుందన్నారు. కుల గణన సర్వే సిబ్బందికి సహకారం అందించాలన్నారు.